సంపుటి :02 సంచిక :172 పేజీలు :06 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com


Voice of the people

శనివారం 30, ఆగస్టు 2025

# అసెంబ్లీ సమావేశాలు షురూ


- ❖ ఎమ్మెల్యే గోపినాథ్ మృతిపై సంతాప తీర్మానం
- ❖ రాజకీయాల్లో గోపినాథ్ సేవలను గుర్తుచేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

02



## 42శాతం బీసీ రిజర్వేషన్లపై

# కీలక 42% నిర్ణయం



- ❖ కోటాకు తెలంగాణ క్యాబినెట్ ఓకే
- ❖ ఇవాళో రేపో జీవో విడుదలయ్యే అవకాశం

02

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్‌పై గత ప్రభుత్వం విధించిన పరిమితిని ఎత్తివేస్తూ జీవో జారీ చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు మార్గం సుగమమైంది. కుల గణనలో బీసీల జనాభా 56 శాతం పైగా ఉందని తేలిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు హైకోర్టు ఆదేశాల ప్రకారం సెప్టెంబర్ 30వ తేదీలోగా స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీనిపై త్వరలో అధికారికంగా జీవో విడుదల కానుంది.

– అక్షరదర్బార్, హైదరాబాద్



## కేటీఆర్, హరీశ్‌రావు అరెస్ట్

ఎరువుల కొరతపై ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్ట్ చేశారు. వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు ర్యాలీగా వెళ్లిన బీఆర్ఎస్ నేతలు, యూరియా సరఫరాపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు అక్కడి నుంచి కదిలేది లేదంటూ కార్యాలయం ముందు బైఠాయించారు. దీంతో ఉద్రిక్తత నెలకొనగా, పోలీసులు కేటీఆర్, హరీశ్ రావుతో పాటు పలువురిని అదుపులోకి తీసుకుని తరలించారు. - అక్షర దర్బార్, హైదరాబాద్

04

## పటిష్ట ఏర్పాట్లు చేయండి

- ❖ గణేష్ నిమజ్జనంపై నగర మేయర్ గుండు సుధారాణి
- ❖ కమిషనర్ తో కలిసి నగర పరిధిలో పలు నిమజ్జన ప్రాంతాల పరిశీలన

05



### కాళేశ్వరం కమిషన్ నివేదికపై

## రేపే అసెంబ్లీలో చర్చ



శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు

02

### గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా

## కోదండరాం, అజారుద్దీన్



తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ఖరారు చేస్తూ ప్రతిపాదిస్తూ గవర్నర్‌కు సిఫార్సు చేసింది. కాంగ్రెస్ పార్టీ వర్గాలు సైతం ఊహించని విధంగా అజారుద్దీన్ పేరును ప్రతిపాదించడంపై ఆశ్చర్యపోతున్నారు.

02



### పేరుకుపోయిన

# బకాయిలు

03

- ❖ ఏకంగా రూ.1,400 కోట్లు పెండింగ్
- ❖ బిల్లులు చెల్లించకపోతే సేవలు అందించలేం
- ❖ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రైవేటు హాస్పిటల్స్ నోటీస్
- ❖ సోమవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్?

పేద ప్రజల ఆరోగ్యానికి అండగా నిలిచే ఆరోగ్యశ్రీ సేవలు సెప్టెంబర్ 1 (సోమవారం) నుంచి నిలిచిపోనున్నాయి. తమ బకాయిలు చెల్లించేందుకు ఈ నెలాఖరు వరకు గడువు విధిస్తూ ప్రభుత్వానికి తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఏఎన్‌హెఏ) నోటీసు అందించింది. నోటీసు అందించి వారం రోజులు గడుస్తున్న ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 372 ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ సేవలు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఆగిపోతాయేమోనని వైద్య వర్గాలు భావిస్తున్నాయి.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్





అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ఖరారు చేస్తూ ప్రతిపాదిస్తూ గవర్నర్‌కు సిఫార్సు చేసింది. కాంగ్రెస్ పార్టీ వర్గాలు సైతం ఊహించని విధంగా అజారుద్దీన్ పేరును ప్రతిపాదించడంపై ఆశ్చర్యపోత ున్నాయి. పార్టీ అధిష్ఠానం అజారుద్దీన్ స్థానంలో గతంలో అమీర్ అలీఖాన్ ను ప్రతిపాదించింది. ఇప్పుడాయన స్థానంలో అజారుద్దీన్ కు చోటు లభించడం విశేషం. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు అజారుద్దీన్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి పార్టీ సంతృప్త పరిచిందనే చర్చ నడుస్తున్నది. ఇక కాంగ్రెస్ తరపున జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో ఎవర్నీ నిలబెడుతారనే అంశంపై జోరుగా చర్చ కొనసాగుతోంది.



# 42% బీసీ రిజర్వేషన్లపై కీలక నిర్ణయం

- కోటాకు తెలంగాణ క్యాబినెట్ ఓకే
- ఇవాళో రేపో జీవో విడులయ్యే అవకాశం



అక్షరదర్బార్, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల్లో రిజర్వేషన్‌పై గత ప్రభుత్వం విధించిన పరిమితిని ఎత్తివేస్తూ జీవో జారీ చేయాలని నిర్ణయించింది. దీని ఆధారంగా ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించనుంది. దీనిపై ఇవాళో రేపో జీవో విడుదల కానుంది. బీసీ రిజర్వేషన్ల పై అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రప్రభుత్వం కొద్దిరోజుల క్రితం రాష్ట్రంలో  కుల గణన చేపట్టింది. కుల గణన సర్వేలో రాష్ట్రంలో బీసీల జనాభా 56 శాతానికి పైగా ఉందని తేలిన నేపథ్యంలో, అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు బీసీలకు విద్యా, ఉపాధి రంగాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బిల్లులు పెట్టి, అసెంబ్లీలో ఆమోదింపజేసింది. ఈమేరకు బిల్లలను రాష్ట్రపతి ఆమోదానికి పంపింది. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తే, రిజర్వేషన్ల పరిమితి 50%  దాటనున్నందున న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వానికి ఒక రకంగా కేంద్రంతో ఘర్షణ నెలకొన్నది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులతో కలిసి వెళ్లి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన సైతం వ్యక్తం చేశారు.

### - హైకోర్టు గడువుతో కదలిక..

స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30వ తేదీలోగా పూర్తిచేయాలని జూన్ 25న హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడంతో రిజర్వేషన్ల అంశంపై ఒత్తిడి పెరిగింది. పెంచిన రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తుండగా, న్యాయపరమైన, రాజ్యాంగపరమైన ఆమోదాలు ఇంకా లభించకపోవడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. కేంద్రం నుంచి బిల్లుల ఆమోదంపై జాప్యం జరుగుతుండటంతో, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. జూలై 10న జరిగిన మంత్రివర్గ సమావేశంలో, సుప్రీంకోర్టు విధించిన 50% రిజర్వేషన్ల పరిమితిని అధిగమించేందుకు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018కి సవరణలు చేస్తూ ఆర్డినెన్స్ తీసుకురావాలని నిర్ణయించింది. ఈ ఆర్డినెన్స్ ముసాయిదాను ఆమోదం కోసం గవర్నర్ కు పంపింది. ఆర్డినెన్స్ సంగతి ఎంతకీ తేలకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ఈ ఉత్కంఠకు తెరదించుతూ సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత తాజాగా నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో 42% రిజర్వేషన్లకు ఓకే చెప్తూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దీనిపై త్వరలో సర్కార్ నుంచి జీవో విడుదల కానుంది.



# అసెంబ్లీ సమావేశాలు షురూ..

- ఎమ్మెల్యే గోపినాథ్  మృతిపై సంతాప తీర్మానం
- రాజకీయాల్లో గోపినాథ్ సేవలను గుర్తుచేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలు శనివారం ప్రారంభమయ్యాయి. శాసనమండలిలో కొత్తగా ఎన్నికైన శాసనమండలి సభ్యులను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభకు పరిచయం చేశారు. మరోవైపు శాసన సభలో ఇటీవల మృతి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సభ్యులు ముందుగా నివాళి అర్పించారు. ఈ మేరకు గోపినాథ్ మృతిపట్ల సీఎం శాసనసభలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. విద్యార్థి రాజకీయాల్లో గోపీనాథ్ చురుగ్గా ఉండేవారని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా పని చేశారని, ఎన్టీఆర్‌కు విశ్వాసపాత్రుడిగా గోపీనాథ్‌కు సత్సంబంధాలు ఉండేవన్నారు. విద్యార్థి నేతగా , ప్రజాప్రతినిధిగా, సినీ నిర్మాతగా రాణించారని చెప్పారు. గోపీనాథ్ తనకు మంచి మిత్రుడని, సన్నిహితుడని గుర్తు చేసుకున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్సీలు రత్నాకర్, రంగారెడ్డి మృతిపట్ల మండలిలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాలపై చర్చ అనంతరం సమావేశాలు వాయిదా పడ్డాయి.




# కాళేశ్వరం కమిషన్ నివేదికపై రేపే అసెంబ్లీలో చర్చ



### - శాసనసభా వ్యవహారాల  మంత్రి శ్రీధర్ బాబు

అసెంబ్లీ సమావేశాలు ఎన్నిరోజులు నిర్వహించాలనే దానిపై రేపు నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. శాసనసభ వ్యవహారాల కమిటీ (బీఏసీ) సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఆదివారం సభలో చర్చ జరుగుతుందని వివరించారు. 'బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆదివారం సభలో పెడతాం. కాళేశ్వరంపై సభలో భారత రాష్ట్రసమితి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు స్పీకరే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అన్ని అంశాలపై చర్చ చేయాలంటే.. నాలుగైదు రోజుల తర్వాత సభ నడుపుతాం. గణేష్ నిమజ్జనం, వరదల దృష్ట్యా సభను వాయిదా వేయాలి' అని వెల్లడించారు.

### - బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్ వాకౌట్

అసెంబ్లీలో శాసనసభ స్పీకర్ ఛాంబర్‌లో సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన జరిగిన శాసనసభా వ్యవహారాల కమిటీ (బీఏసీ) సమావేశం నుంచి బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి తొలుత హాజరయ్యారు. శాసనసభ సమావేశాల్లో ఎరువులపై, వరదలపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఇందుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో వారు ఆ సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

### - కేటీఆర్, హరీశ్ రావు అరెస్ట్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ నుంచి వ్యవసాయ శాఖ కమిషనర్‌కి ఎరువుల కొరతపై వినతి పత్రం ఇవ్వడానికి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. రైతులకు యూరియా సరఫరా చేయాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులతో అసెంబ్లీ నుంచి అగ్రికల్చర్ కమిషనరేట్ కు చేరుకుని రాష్ట్రంలో ఎరువుల కొరతపై అగ్రికల్చర్ కమిషనర్ కి వినతి పత్రం ఇచ్చారు. యూరియా మీద స్పష్టమైన హామీ ఇచ్చేవరకు, కదిలేది లేదంటూ వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బైఠాయించారు. యూరియా కావాలని రైతుల పక్షాన ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకులను అగ్రికల్చర్ కమిషనరేట్ కార్యాలయంలో అరెస్టు చేసిన పోలీసులు అక్కడి నుంచి తరలించారు. కేటీఆర్, హరీశ్ రావు, నిరంజన్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కార్యాలయం మందు బైఠాయిస్తామని కేటీఆర్ తేల్చిచెప్పారు. గణపతి బప్పా మోరియా.. రావాలయ్యా యూరియా అంటూ బీఆర్ఎస్ నేతలు నినాదాలు చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కి వినతి పత్రం ఇచ్చిన సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే.. రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని ఆరోపించారు. కరోనా లాంటి విపత్తు సమయంలో కూడా తాము ఎరువులు అందించాం.. ఇప్పుడు ఏమైంది అంటూ నిలదీశారు. గత నెల రోజులుగా రైతులు నిద్రాహారాలు మాని తెల్లవారు జాము నుండే పడిగాపులు కాస్తుంటే మీకు పట్టింపు లేదా? అని ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ ఒకరిపై ఒకరు నెపం వేసుకుని తప్పించుకుంటున్నారని విమర్శించారు.

# చిట్యాలలో కళోత్సవం



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి కళోత్సవం శనివారం సందడిగా జరిగింది. నృత్యం, సంగీతం, చిత్రకళ, కథల చెప్పడం వంటి విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని ఎంఈఓ కోడెపాక రఘుపతి ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు కళల్లోనూ రాణించాలని సూచించారు. జడ్జిలుగా సాంబమూర్తి, తుపాకుల వందన, స్వరూప వ్యవహరించారు. నీలిమారెడ్డి ప్రోగ్రాం ఇన్‌చార్జిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సిఆర్పీలు, గ్రామస్తులు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై కళోత్సవాన్ని ఆనందంగా వీక్షించారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీ డే




అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల అంగన్వాడీ నం.1, క్రోసూరుపల్లి కేంద్రాల్లో ఈసీసీ డే వేడుకలు నిర్వహించారు. టీచర్లు సంధ్యారాణి, సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడీ సేవలు, పిల్లల శారీరక–మానసిక అభివృద్ధి ప్రాధాన్యం వివరించారు. ప్రతి నెల నాల్గవ శనివారం ఈసీసీ డే నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తల్లులు లావణ్య, శిరీష, వనిత, రమ్య, సౌజన్య, శ్రీలత, పూజ, నమిత, స్వాతి పాల్గొన్నారు.




# పేరుకుపోయిన బకాయిలు

- ఏకంగా రూ.1,400 కోట్లు పెండింగ్
- బిల్లులు చెల్లించకపోతే సేవలు అందించలేం
- రాష్ట్ర ప్రభుత్వానికి ప్రైవేటు హాస్పిటల్స్ నోటీస్
- సోమవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్?

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

పేద ప్రజల ఆరోగ్యానికి అండగా నిలిచే ఆరోగ్యశ్రీ సేవలు సెప్టెంబర్ 1 (సోమవారం) నుంచి నిలిచిపోనున్నాయి. తమ బకాయిలు చెల్లించేందుకు ఈ నెలాఖరు వరకు గడువు విధిస్తూ ప్రభుత్వానికి తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఏఎన్‌హెఏ) నోటీసు అందించింది. నోటీసు అందించి వారం రోజులు గడుస్తున్న ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 372 ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ సేవలు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఆగిపోతాయేమోనని వైద్య వర్గాలు భావిస్తున్నాయి.

## - ఏడాది నుంచి పైసా లేదు

రాష్ట్రంలో ఉన్న ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు ప్రభుత్వం ఏడాదికాలంగా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని టీఏఎన్‌హెఏ తెలిపింది. సాధారణంగా ఆరోగ్యశ్రీ సేవలు పొందిన తర్వాత 40 రోజుల్లోపు బిల్లులు చెల్లించాలి. అయితే 400 రోజులు దాటినా ఈ ప్రభుత్వం బిల్లులు చెల్లించే పరిస్థితి కనపడటంలేదని ప్రైవేట్ హాస్పిటల్స్ వాపోతున్నాయి. జనవరిలో బకాయిల చెల్లింపు గురించి ప్రభుత్వం హామీ ఇచ్చినా.. అది మాత్రం అమల్లోకి రాలేదు. దీని వల్ల ఆస్పత్రులపై ఆర్థికభారం పడుతుందని.. అందుకే సమస్య పరిష్కారం కోసం ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయబోతున్నట్లు ప్రకటించారు.

### జర్నలిస్టులు, ఉద్యోగుల హెల్త్ స్కీమ్స్ సహా..

**ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలు, మధ్య తరగతి ప్రజలకు ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఇక కాంగ్రెస్ సర్కార్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంచిన సంగతి తెలిసిందే. బకాయిల పెండింగ్ అంశం గురించి గతంలోనే అసోసియేషన్ ఆపేస్తామని చెప్పినా.. ప్రభుత్వం వాటిని సీరియస్ గా పట్టించుకోలేదు. దీంతో సెప్టెంబర్ 1 నుంచి ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆరోగ్యశ్రీతో పాటు జర్నలిస్టులు, ఉద్యోగుల హెల్త్ స్కీమ్స్ కు కూడా ఈ నిలిపివేత వర్తించనుంది. ప్రభుత్వం సకాలంలో బకాయిలు చెల్లించకపోవడం వల్లనే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని టీఏఎన్ హెఏ తెలిపింది. ఆస్పత్రులపై ఆర్థిక భారం పెరగడం కూడా ఈ నిర్ణయానికి ఒక కారణమని అంటున్నారు. ఈ ఏడాది జనవరిలోనే ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తామని టీఏఎన్ హెఏ హెచ్చరించింది. చర్చల అనంతరం దీన్ని కొనసాగించేందుకు ఆసుపత్రులు ప్రభుత్వానికి కొన్ని విజ్ఞప్తులు చేశాయి. ఆ సమయంలో రూ.1,400 కోట్ల బకాయిలను విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ, ఇప్పటివరకు ఆ హామీని నెరవేర్చలేదు. అందుకే ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయాలని నిర్ణయించుకున్నట్లు టీఏఎన్ హెఏ తెలిపింది. ఈమేరకు ఆరోగ్యశ్రీ సీఈవోకు టీఏఎన్ హెఏ ఇప్పటికే లేఖ రాసింది.**




# వినాయక నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాల అనంతరం జరగబోయే వినాయక నిమజ్జనానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్‌డీఓ డా. కె. నారాయణ, ఏసీపీ సతీష్ బాబు, మున్సిపల్ కమిషనర్ కె. సుష్మ, తహసీల్దార్ విజయలక్ష్మి , విద్యుత్ శాఖ ఏఈ రాజ్‌కుమార్ తదితరులు చలివాగు ప్రాంతాన్ని సందర్శించారు. నిమజ్జన ప్రదేశంలో క్రేన్, జేసీబీ, ట్రాక్టర్లు, లైటింగ్ వంటి సదుపాయాలపై చర్చించడంతో పాటు, ముళ్లపొదలు తొలగింపు, ప్రదేశం చదును చేయడం, సిబ్బంది నియామకం, బారికేడ్ల ఏర్పాటు వంటి చర్యలను తీసుకోవాలని సూచించారు.

## పట్టణంలో పారిశుద్ధ్య తనిఖీలు

పరకాల పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ కె. సుష్మ తనిఖీ చేశారు. మమతానగర్ సహా పలు ప్రాంతాలను పరిశీలించి, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెత్త సేకరణ, ఆయిల్ బాక్స్ ఏర్పాటు, పారిశుద్ధ్యంపై మరింత శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా సమస్యలు తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు.

# కీర్తి రెడ్డికి బర్త్ డే విషెస్ తెలిపిన లాడే శివ



అక్షర దర్బార్, పరకాల: భూపాలపల్లి నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర అధికారిక ప్రతినిధి చందుపట్ల కీర్తి రెడ్డి జన్మదిన సందర్భంగా జిల్లా బీజేపీ నాయకుడు లాడే శివ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లాడే శివ మాట్లాడుతూ, భూపాలపల్లి ప్రాంతంలో బీజేపీని బలోపేతం చేసేందుకు కీర్తి రెడ్డి విశేష కృషి చేశారని, ప్రజల సమస్యల పక్షాన ఎల్లప్పుడూ నిలబడి పోరాడుతున్న గొప్ప నాయకురాలని ప్రశంసించారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తూ, సామాన్య కార్యకర్తలకు కూడా గౌరవస్థానం కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

# పోలీస్ జాగిలానికి సత్కారం

## - ఘనంగా పదవీ విరమణ కార్యక్రమం



అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో 12 వసంతాలు సేవలందించిన పోలీస్ జాగిలం బ్రోనోకు పోలీస్ అధికారులు శనివారం పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సుదీర్ఘ కాలంగా సేవలందించిన బ్రోనోను ఘనంగా సత్కరించారు. ట్రాకర్ జాగిలంగా గుర్తించబడిన బ్రోనో పోలీస్ శాఖలో చేరిన నాటి నుండి 15 కేసుల్లో నిందితులను గుర్తించడంతో పాటు జాతీయ పోలీస్ డ్యూటీ మీట్లలో పలు పతకాలను సాధించింది. దీని శిక్షకుడిగా హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ వ్యవహరించారు.

# నేడు డయల్ యువర్ డీఎం

అక్షరదర్బార్, హనుమకొండ: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు హనుమకొండ ఆర్టీసి డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. తమ డిపో పరిధిలోని జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలావరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, కాజీపేట మండలాల ప్రజలు 8977781103కు నిర్ణీత సమయంలో ఫోన్ చేసి తమ విలువైన సూచనలను, సలహాలను అందించి డిపో అభివృద్ధికి సహకరించాలని డీఎం కోరారు.



# అక్రమ గుట్కా దందాపై టాస్క్ ఫోర్స్ దాడి

అక్షర దర్బార్, పరకాల: పరకాలలో అక్రమంగా గుట్కా, పొగాకు విక్రయిస్తున్న వ్యాపారి వద్ద టాస్క్ ఫోర్స్ దాడి చేసి రూ.2,01,600 విలువైన సరుకును స్వాధీనం చేసుకుంది. టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు బృందం విశ్వసనీయ సమాచారం ఆధారంగా వ్యాపారి చంద్రశేఖర్ గుప్తా ఇంట్లో తనిఖీ చేశారు. అనంతరం నిందితుడు సహా స్వాధీనం చేసుకున్న సరుకును పరకాల పోలీసులకు అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీధర్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై వీరస్వామి సహా పోలీసులు పాల్గొన్నారు.



# రంగాపురంలో సమస్యలు పరిష్కరించాలి

## ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి మల్లికార్జున్

అక్షర దర్బార్, దుగ్గొండి: రంగాపురం గ్రామంలో రోడ్లపై బురదనీరు నిలిచి చెరువులను తలపిస్తోందని ఎం సి పి ఐ (యు) మండల కార్యదర్శి సింగతి మల్లికార్జున్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పార్టీ బృందం గ్రామాన్ని సందర్శించి సమస్యలను పరిశీలించింది. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, అర్హులందరికీ పెన్షన్లు ఇప్పటికీ రాకపోవడం విచారకరమని అన్నారు. గ్రామంలో పరిశుభ్రత లోపించిందని, చెత్త పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోందని వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుడిమే సురేందర్, కుమారస్వామి, గాంధీ, ఓంకార్, సతీష్, సింగతి కిరణ్, అంకటి రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట డిపో బస్సు రూట్ మార్చాలి

## పరకాల బీజేపీ నేత మార్త భిక్షపతి



అక్షర దర్బార్, పరకాల: నర్సంపేట డిపో పరిధిలో బస్సు రూట్ మార్చాలని పరకాల బీజేపీ సీనియర్ నాయకులు మార్త భిక్షపతి పేర్కొన్నారు. శనివారం జరిగిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నర్సంపేట నుండి బయలుదేరే బస్సులు రాజీపేట, సీతారాంపురం, వెల్లంపెల్లి, పోచారం, నరసింహులపల్లె, పల్లెగట్లకానిపర్తి, సూరంపేట, మాందారిపేట గ్రామాల మీదుగా నడిస్తే స్థానిక ప్రయాణికులకు సౌకర్యం కలుగుతుందని, ఆర్టీసీకి ఆదాయం కూడా పెరుగుతుందని సూచించారు. ఈ మేరకు పరకాల డిపో మేనేజర్ స్పందిస్తూ, త్వరలోనే స్వయంగా సర్వే నిర్వహించి పై అధికారులకు నివేదిక సమర్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అభ్యర్థనపై సానుకూలంగా స్పందించినందుకు డిపో మేనేజర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్సారెస్పీ కెనాల్ లో వ్యర్థాల పారవేత

## తీవ్ర దుర్గంధంతో ప్రజల ఇబ్బందులు

అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి రహదారి వెంట ఉన్న ఎస్సారెస్పీ కెనాల్‌లో కొందరు నిర్లక్ష్యంగా చేపలు, కోళ్ల వ్యర్థాలను పారవేయడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో చుట్టుపక్కల ఇళ్లలో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాసనతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండీఓ కార్యాలయం, ఫంక్షన్ హాల్ పక్కనే కెనాల్ కలుషితమవుతుండటంతో అక్కడకు వచ్చే జనాలు, రైతులు, కూలీలు, దారి వెంట ప్రయాణించే వారు అసహనానికి గురవుతున్నారు. కెనాల్ కట్ట వద్ద డంప్ యార్డు తలపించే పరిస్థితి నెలకొంది. తక్షణమే శుభ్రపరిచి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.





# పంచాయతీ ఎన్నికల కోలాహలం

- ప్రధాన పార్టీలకు సవాల్ గా మారుతున్న యువత
- యువత శక్తిపై సీనియర్ నాయకుల ఆందోళన
- పరకాల, నడికూడ మండలాల్లో పంచాయతీ ఎన్నికలపై యువత ఆసక్తి



అక్షరదర్బార్, పరకాల: తెలంగాణలో 2024 జనవరి 31వ తేదీన సర్పంచుల పదవీకాలం ముగిసినా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఆలస్యమవుతున్న విషయం తెలిసిందే. అయితే, ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా కీలక అప్డేట్‌ను విడుదల చేసింది. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ జారీ చేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియకు పునరుద్ధరణ జరిగింది. సెప్టెంబర్ 2 నాటికి, జిల్లా పంచాయతీ అధికారులు అన్ని గ్రామపంచాయతీల్లో ఫొటో ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తారు. దీనికి తోడు శనివారం జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం యాభై శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేత, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు జీవో విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పరకాల, నడికూడ మండలాల్లోని పలు గ్రామాల్లో యువత రాజకీయ రంగంలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపిస్తోంది. గ్రామస్థాయిలో యువ నాయకులు తాము ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటిస్తున్నారు. ఇది గ్రామపంచాయతీ ఎన్నికలలో ఒక పెద్ద పరిణామంగా మారింది.

## - ప్రధాన పార్టీలకు సవాల్

**ప్రస్తుతం రాజకీయాల పట్ల యువతకు ఆసక్తి కనబరుస్తుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రధాన పార్టీలు ముఖ్యంగా టికెట్లు ఇవ్వకపోతే యువతకు కొత్త పార్టీలు లేదా ఆహ్వానించిన మార్గాలు తమ అభ్యర్థులుగా నిలబడేందుకు ప్రేరణగా మారుతున్నాయి. ఈ పరిస్థితిలో ప్రధాన పార్టీలకు ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. సమాజంలో యువతలో ఒక నిరాశ నెలకొంది. ముఖ్యంగా వారు అనేక ఎన్నికల్లో మంచి మార్పు లేనట్టుగా భావిస్తున్నారు. ఫలితంగా అవసరమైతే స్వతంత్ర అభ్యర్థులుగా నిలబడటానికి యువత సిద్ధమవుతుంది. ఇది తదుపరి ఎన్నికల్లో ఒక కీలక పరిణామం కావచ్చు. ముఖ్యంగా యువత కొత్త అభ్యర్థులను, కొత్త విధానాలను ప్రదర్శించడం ద్వారా ప్రధాన పార్టీలు ఎదుర్కొనాల్సిన సవాళ్లు పెరిగే అవకాశం ఉంది. సీనియర్ నాయకులు ఈ పరిణామంతో కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారు అనుభవంతో కూడిన నాయకత్వాన్ని ప్రతిపాదించాలనుకుంటున్నా, యువత శక్తిగా ఎదుగుతున్నది."యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొనడం సంతోషకరమే, కానీ వారిలో అవగాహన పెరిగిన తర్వాత మాత్రమే వారు సరైన మార్గంలో ముందుకు సాగాలని ఆశిస్తున్నాం" అని ఒక గ్రామస్థుడు తెలిపారు. ఈ కొత్త కోలాహలం, గ్రామపంచాయతీ ఎన్నికలపై కొత్త దిశలకు ఆస్కారం ఉంది.**



# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పాత ఏటీఎం సెంటర్ వద్ద దహనం చేశారు. ఇటీవల బీహార్ యాత్రలో జరిగిన సభలో ప్రధాని నరేంద్ర మోడీ మాతృమూర్తిపై రాహుల్ గాంధీ అవమానకర వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గాజుల నిరంజన్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా మోడీకి లభిస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక కాంగ్రెస్ పార్టీ అసభ్యపదజాలానికి దిగజారుతోందని విమర్శించారు. రాహుల్ గాంధీ వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంఘ పురుషోత్తం, కాసగాని రాజ్ కుమార్, కుక్కల విజయ్ కుమార్, మారేడుగొండ భాస్కరాచారి, పల్లెబోయిన రామన్న, పావు శెట్టి శ్రీనివాస్, నాగెల్లి రంజిత్, దార్న సునీల్, ఆకుల రాంబాబు, గోనెల నరసింహ, నాగరాజు, కక్కు రాజు, సారంగ నరేష్, సాదా మధుకర్, గాజుల రంజిత్, దామ సతీష్, జనగాని రాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మమతా నగర్ లో మహా అన్నదానం

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణం 10వ వార్డు మమతా నగర్ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విగ్రహ దాత తాళ్లపల్లి వెంకటేశ్వర్లు–కవితల సహకారంతో జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా, కాలనీ వాసులు ముప్పిడి రంజిత్–మమత, దార్న రవీందర్–సత్యవతి ఆధ్వర్యంలో స్వామివారి సన్నిధానంలో అన్నదానం జరిగింది. శనివారం నిర్వహించిన ఈ మహా అన్నదానంలో కాలనీ వాసులు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నిర్వాహకులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



# ఏర్పాట్లు చేయండి

- గణేష్ నిమజ్జనంపై నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్ తో కలిసి నగర పరిధిలో పలు నిమజ్జన ప్రాంతాల పరిశీలన

అక్షరదర్బార్, వరంగల్: గణేష్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం బల్దియా పరిధి లోని బెస్తం చెరువు, ఉర్సు చెరువు, బంధం చెరువు ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి క్షేత్ర స్థాయిలో సందర్శించి సమర్థవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా బల్దియా తరపున అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ట్రాష్ కలెక్టర్ యంత్రం ద్వారా చెరువుల్లో కొనసాగుతున్న పూడిక తీత, గుర్రపు డెక్క తొలగింపు పనులను ఇరువురు పరిశీలించారు. ఇరిగేషన్ వారి సహకారంతో పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. బల్దియా ద్వారా రహదారులపై గ్రావెల్, తగినంత లైటింగ్, శానిటేషన్ లో భాగంగా ఎప్పటికపుడు నిమజ్జన పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన పూర్ణ చందర్, అరుణ, విక్టర్, మరుపల్ల రవి, మానస రాంప్రసాద్, సీఎంహెచ్ ఓ డా రాజారెడ్డి, డీఎఫ్ ఓ శంకర్ లింగం, ఎంహెచ్ ఓ డా రాజేష్, ఇరిగేషన్ ఈఈ శంకర్, బల్దియా ఈఈలు సంతోష్ బాబు, మాధవిలత, డీఈలు రవికిరణ్, సతీష్, రాగి శ్రీకాంత్, ఇరిగేషన్ డీఈ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.







# రైతులు ఆందోళన చెందొద్దు

అక్షర దర్బార్, శాయంపేట : వానాకాలం సీజన్ కోసం శాయంపేట మండలానికి ఇప్పటివరకు 1235 టన్నుల యూరియా అందించామని వ్యవసాయ అధికారి గంగా జమున తెలిపారు. అలాగే 750 లీటర్ల నానో యూరియా రైతులకు పంపిణీ చేయగా, ఇంకా 473 లీటర్ల నానో యూరియా షాపుల్లో అందుబాటులో ఉందని తెలిపారు. ప్రగతి సింగారం, శాయంపేట, గట్లకనపర్తి గ్రామాల్లోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ ఫెర్టిలైజర్స్ షాపుల్లో యూరియా శని, ఆదివారాల్లో అందుబాటులో ఉంచను న్నట్లు చెప్పారు. స్టాక్ అయిపోయిన వెంటనే మళ్లీ యూరియా తెప్పిస్తామని ఏవో గంగా జమున హామీ ఇచ్చారు. పత్తి పంటకు రెండో, మూడో దఫా ఎరువుగా రైతులు నానో యూరియా వాడాలని సూచించారు.



# స్వచ్ఛ, హరిత విద్యాలయ ర్యాంకింగ్ పై అవగాహన

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ మరియు హరిత విద్యాలయ ర్యాంకింగ్ పై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ కోడెపాక రఘుపతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను శుభ్రంగా, ఆకుపచ్చ వాతావరణంగా మార్చాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీ కుసునపు కిరణ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు మహేందర్, తిరుపతయ్య, శ్రీనివాస్, శ్రీలత, రవీందర్, అలాగే ఎమ్మార్సీ సిబ్బంది హరీష్, నరేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# కీర్తి రెడ్డికి బర్త్ డే విషెస్

అక్షర దర్బార్ శాయంపేట : భూపాలపల్లి నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి చందుపట్ల కీర్తిరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శాయంపేట బీజేపి మండల శాఖ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి,మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగులు

# ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

### వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



అక్షరదర్బార్, హనుమకొండ: పదవీవిరమణ చేసిన పోలీస్ అధికారులు తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో సుదీర్ఘ కాలం పని చేసి పదవీవిరమణ చేసిన పోలీస్ అధికారు లను వరంగల్ సీపీ శనివారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పదవీ విరమణ పొందిన వారిలో ఎస్ఐలు యాకుబ్ మొహినొద్దీన్, మహమ్మద్ అలీ, రాధే శ్యామ్ శర్మ, యాదగిరి, నందమచారి, ఏఎస్ఐలు జిలాని, సురేందర్, హెడ్ కానిస్టేబుళ్లు ముత్తయ్య, యాకుబ్ పాషా, శ్రీనివాస్ ఉన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ మీ సేవలు నేటి తరం పోలీసులకు అదర్శంగా నిలుస్తాయని, నేటి ఈ ప్రశాంత వాతావరణానికి మీ సేవలే కారణమని, మీరు అందించిన సేవలు మరువమని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, శ్రీనివాస్, ఏసీపీ సురేంద్ర, ఆర్ఐలు సతీష్, స్పర్జన్ రాజ్, శ్రీనివాస్, శ్రీధర్, చంద్రశేఖర్, ఆర్ఎస్ఐ శ్రవణ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గ్యానం సారయ్యకు ఘన నివాళి



అక్షర దర్బార్, (నూగూరు) వెంకటాపురం: పేద, పీడిత ప్రజల కోసం జీవితాంతం పోరాడిన నిస్వార్థ కమ్యూనిస్టు నాయకుడు గ్యానం సారయ్యకు ఘన నివాళి అర్పించారు. ఆయన నాలుగవ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక సాస్టైటీ కార్యాలయం మండపంలో సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, గ్యానం సారయ్య జీవితమే ఉద్యమకారులకు ఆదర్శమని పేర్కొన్నారు. మండలంలో తునికాకు కట్ట రేటు, కూలీ రేటు, జమీందారీ, పెత్తందారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.రెడ్డి సాంబశివ, కార్యదర్శి సభ్యులు తుమ్మల వెంకట రెడ్డి, ఎండి దావూద్, కొప్పుల రఘుపతి, వంకా రాములు, మండల కార్యదర్శి గ్యానం వాసు, నాయకులు చారి, మాణిక్యం తదితరులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిమజ్జన ప్రదేశాల్లో అధికారుల పరిశీలన



ఎస్ఐ తహసీల్దార్ సత్యనారాయణ ముందు బైండోవర్ చేశారు.

అక్షర దర్బార్ శాయంపేట : గణపతి నవరాత్రుల ఉత్సవాల అనంతరం నిమజ్జనం విజయవంతం చేయడానికి శాయంపేట గ్రామం దేవుని చెరువు,ప్రగసింగారం గ్రామం చలివాగు వంతెన ప్రదేశాలను శనివారం తాహసీల్దార్ సత్యనారాయణ ఎంపీడీవో ఫణిచంద్ర, ఎస్ఐ పరమేశ్వర్, ట్రాన్స్ కో ఎ ఈ లు పరిశీలించారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు కావల సిన వసతులు, ఏర్పాట్ల పై తగు సూచనలు సలహాలు చేశారు.అదేవిధంగా మండలంలో డిజె సౌండ్ సిస్టం 13 మంది నిర్వాహకులను

# సన్న వడ్ల బోనస్ ఎక్కడ..?

### సింగిల్ విండో డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి



అక్షర దర్బార్, కేసముద్రం: రైతులకు వాగ్దానం చేసిన సన్న వడ్ల బోనస్ డబ్బులు ఎక్కడ పోయాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సింగిల్ విండో డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి మండిపడ్డారు. శనివారం పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ కాంగ్రెస్ రెండు సంవత్సరాలు అధికారంలోకి వచ్చి, కొందరు రైతులకే బోనస్ ఇచ్చి మిగతావారిని విస్మరించిందని విమర్శించారు.అలాగే రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతుండగా, ఎరువుల కేంద్రాల వద్ద రోజులు గడిపి కూడా సరిపడా ఎరువు దొరకక రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. బడాబాబులు నల్లబజారులో యూరియా అమ్ముకుంటున్నా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. “రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ, రైతులను మోసం చేస్తోంది. మరోవైపు బీజేపీకి తెలంగాణ రైతులపై సోయి లేదు. ఇద్దరూ రైతు వ్యతిరేకులే” అని రవీందర్ రెడ్డి ధ్వజమెత్తారు.

# చిరుతపల్లి బాలికల హాస్టల్ లో వైద్య శిబిరం

అక్షర దర్బార్, (నూగూరు) వెంకటాపురం: మండలంలోని చిరుతపల్లి గిరిజన బాలికల వసతి గృహంలో నూగూరు సబ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు జ్వరపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థులకు కాలానుగుణ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఉతికిన బట్టలు ఎండిన తర్వాత మాత్రమే ధరించాలని సూచించారు. అలాగే భోజనం ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరస్వతి, హాస్టల్ వార్డెన్ ఉష, ఉపాధ్యాయుడు సుజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మొగుళ్లపల్లిలో పౌర హక్కుల దినోత్సవం

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : మొగుళ్లపల్లి మండల కేంద్రంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. తహసీల్దార్ జాలి సునీతా రెడ్డి, ఎస్సై బోరగాల అశోక్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు సామాజిక వివక్ష, ఆర్థిక దోపిడీ, కుల అంటరానితనం వంటి సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. .

# జనగామలో చైన్ స్నాచింగ్

అక్షరదర్బార్, జనగామ: ఓ మహిళ మెడలో నుంచి నాలుగు తులాల బంగారు మంగళసూత్రాన్ని అపహరించిన ఘటన జనగామ జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డలో శనివారం చోటుచేసుకుంది. బాధితురాలు భాగ్యలక్ష్మి కథనం ప్రకారం.. ఇంటి వద్ద పైపుతో నీరు పడుతుండగా, గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మెడలో నుంచి మంగళసూత్రాన్ని దొంగిలించుకుని పారిపోయాడు. ఘటనా స్థలానికి జనగామ సీఐ దామోదర్ రెడ్డి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : aksharadarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915